# ఒకమాట !

భారత రాజ్యాంగం అధికరణం 17 లో అంటరానితనం పాటించటం నిషేధిస్తూ అంటరానితనాన్ని నేరంగా ప్రకటించింది. ఈ అధికరణానికి అనుగుణంగా రాజ్యాంగం అమలులోకి వచ్చిన 5 సంవత్సరాలకు 'అస్పృశ్యతా నేరాల చట్టం 1955' వచ్చింది. ఇది చాలా బలహీనమైన చట్టంగా అసలు అమలుకే నోచుకోని చట్టంగా పరిహాసమైంది. ఈ నేపథ్యంలో దీనికి 1976లో సవరణలు చేస్తూ 'పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955' గా మార్చారు. ఇది కూడ బలహీనమైన చట్టమే. కుల దురహంకారంతో దళితులపై అత్యాచారాలు చేసేవారిని అదుపుచేసే ఉద్దేశ్యం, శక్తి ఈ చట్టానికి లేదని, ఇందులో శిక్షలు నామమాత్రమేనని దళిత ఉద్యమం భావించింది. దళితులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా వచ్చిన దళిత ఉద్యమం, ప్రత్యేకంగా 1985 కారంచేడు మారణకాండకు వ్యతిరేకంగా పెల్లుబికిన దళిత ఉద్యమం, నేపథ్యంలో ప్రభుత్వం "షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (అత్యాచార నిరోధక) చట్టం 1989" అనే పటిష్టమైన చట్టాన్ని రూపొందించింది.

గత చట్టంతో పోల్చినపుడు ఈ నూతన చట్టం మెరుగయినదే. ఈ చట్టం వచ్చి నేటికి 26 సంవత్సరాలయింది. దళిత ఉద్యమం, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఈ చట్టం అమలును సమీక్షించి దీనిలో లొసుగులు తొలగించి, మరింత పటిష్ఠపరచాలని డిమాండు చేశారు. ఈ చట్టాన్ని తగు విధంగా సవరించాలనే డిమాండ్‌తో అనేక దళిత, ఆదివాసీ సంస్థలు, ప్రజాస్వామిక వాదులు కలిసి జాతీయ స్థాయిలో ఒక సంఘటనగా ఏర్పడి నిర్విరామకృషి చేశారు. ఈ కృషి ఫలితంగా దళిత ఉద్యమ డిమాండ్లకు అనుగుణంగా చట్టాన్ని సవరిస్తూ గత కాంగ్రెసు ప్రభుత్వం మార్చి 2014లో ఒక 'ఆర్డినెన్సు' జారిచేసింది. అయితే ఈ ఆర్డినెన్సు ఆరు నెలల్లోగా చట్టంగా పార్లమెంటులో ఆమోదించబడాలి. ఈ లోగా ఎన్నికలు రావటం, ప్రభుత్వాలు మారటంతో ఈ ఆర్డినెన్సు చట్టంగా ఆమోదించబడటం వాయిదా పడింది. అయితే జాతీయ స్థాయిలో దళిత సంస్థల సంఘటన ఈ అంశంపై మరల నడుము బిగించి కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో చట్టం వచ్చేలా ఉద్యమించింది. ఫలితంగా 2015 డిసెంబరు 31న పాత ఆర్డినెన్సు స్థానంలో "షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (అత్యాచార నిరోధక) సవరణల చట్టం

2015” అనబడే చట్టం పార్లమెంటు ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకంతో 2016 జనవరి 26 నుంచి అమలులోనికి వచ్చింది.

ఈ సవరణల చట్టం “షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం 1989” లో కొన్ని కొత్త సెక్షన్లను చేర్చింది, కొన్నింటిని మార్పుచేసింది. ఇలా మార్పులు, చేర్పులకు గురయిన తర్వాత ఈ చట్టం పూర్తి పాఠంతో ప్రచురించాలని, అందరికీ, ముఖ్యంగా దళితులకు చేరువలో ఉంచాలనే ఉద్దేశ్యంతో ఈ చట్టాన్ని తెలుగులో అనువదించి అందజేస్తున్నాం. 2015 సవరణల ద్వారా కొత్తగా చేర్చిన సెక్షన్లు, మార్పులు తెలిసేందుకై ఆ వాక్యాలు ప్రత్యేక అక్షరాల్లో పెట్టబడ్డాయి. 2015 నాటి సవరణలతో సహా “షెడ్యూల్డు కులాల, తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం 1989” ని చదివి ప్రస్తుత స్థితిని అవగాహన చేసుకోగలరని ఆశిస్తున్నాం.

**ఝాన్సీ గెడ్డం**

జాతీయ కన్వీనర్

దళిత స్త్రీ శక్తి

# షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలపై
# అత్యాచారాల నిరోధక చట్టం 1989

షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రజలపై అత్యాచారాల నిరోధానికి, అత్యాచారాలు జరిగినప్పుడు అటువంటి నేరాలను విచారించేందుకు **ప్రత్యేక కోర్టులు మరియు కేవలం ఈ నేరాలను విచారించేందుకు మాత్రమే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టులు,** ఏర్పాటుచేసేందుకు అత్యాచారాలకు గురైన బాధితులకు, సహాయ, పునరావాసాలు ఏర్పాటు చేసేందుకు ఈ చట్టం ఉద్దేశించబడినది.

## అధ్యాయము I

### 1. ప్రారంభిక

1. 1) ఈ చట్టమును షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలపై అత్యాచారాల నిరోధక చట్టము, 1989 అని పిలవవచ్చు

2) ఇది జమ్మూ-కాశ్మీరు మినహా యావద్భారత దేశమునకు వర్తిస్తుంది.

3) ఇది కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో ప్రకటించిన తేదీ నుండి అమలులోకి వస్తుంది.

### 2. నిర్వచనములు :

1. ఈ చట్టములోని సందర్భమునుబట్టి వేరే అర్థము వస్తే తప్ప

ఎ) "అత్యాచారము" అనగా 3వ సెక్షను క్రింద శిక్షింపదగిన నేరము అని అర్థము.

బి) "స్మృతి" అనగా నేర విచారణస్మృతి 1973 అని అర్థము.

***బిబి) "ఆధారపడిన వ్యక్తి" అనగా బాధిత వ్యక్తిపై తమ జీవనోపాధికై ఆధారపడిన భార్య లేదా భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు.***

*బిసి) "ఆర్థిక బహిష్కరణ" అనగా*

*i) ఎవరైనా వ్యక్తితో లావాదేవీలు జరుపుటకు, పనికి నియమించుకోవటానికి లేదా వ్యాపారం చేయుటకు నిరాకరించడం; లేదా*

*ii) పైకము తీసుకుని పనిచేసే అవకాశాలను ఇతర సేవలకు అవకాశాలను నిరాకరించడం; లేదా*

*iii)* *సామాజిక జీవితంలో సాధారణంగా అమలవుతున్న నియమాలకు అనుగుణంగా చేయాల్సిన పనిని దేనినైనా నిరాకరించడం; లేదా*

*iv)* *ఇతరులతో మామూలుగా జరుపుతున్నటువంటి వృత్తిపరమైన లేదా వ్యాపారపరమైన సంబంధాలను నిరాకరించడం.*

*బిడి) "కేవలం ఈ నేరాల విచారణ కొరకు మాత్రమే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టు" అనగా సెక్షన్ 14(1) కింద ఈ చట్టంలోని నేరాలను విచారించేందుకు మాత్రమే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టు;*

*బిఇ) "అటవీ హక్కులు" అనగా షెడ్యూల్డు తెగలు సాంప్రదాయ ఆదివాసీల హక్కుల గుర్తింపు చట్టం, 2006 సెక్షన్ 3 లో నిర్వచించబడిన అర్థం కలిగి వుంటుంది.*

*బిఎఫ్) "పారిశుధ్య కార్మికులు" అనగా పారిశుద్య కార్మికుల నియామకంపై నిషేధం మరియు వారి పునరావాస చట్టం 2013 లోని సెక్షన్ 2(1) (g) లో నిర్వచించబడిన అర్థం కలిగి వుంటుంది.*

*బిజి) 'ప్రభుత్వ ఉద్యోగి" అనగా భారత శిక్షాస్మృతి లోని సెక్షన్ 21 లో నిర్వచించబడిన అర్థం కలిగివుంటుంది. అంతేకాక అమలులోవున్న ఇతర చట్టాలలో ఎవరినైనా ప్రభుత్వ అధికారిగా పరిగణించినపుడు ఆ వ్యక్తి మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున అధికారికంగా వ్యవహరిస్తున్న వ్యక్తులను కూడా ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించాలి.*

సి) "షెడ్యూల్డు కులములు మరియు షెడ్యూల్డు తెగలు" అనగా భారత రాజ్యాంగం ఆర్టికల్ 366 లో క్లాజ్ (24) మరియు (25) లలో చెప్పబడిన అర్థము కలిగి ఉంటుంది.

డి) "ప్రత్యేక న్యాయస్థానము" అనగా సెక్షన్ 14లో చెప్పబడిన న్యాయస్థానము అని అర్థము.

ఇ) "ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు" అనగా సెక్షన్ 15లో చెప్పబడిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు అని అర్థము.

*ఇఎ) "అనుబంధం" అనగా ఈ చట్టానికి చేర్చబడిన అనుబంధం.*

*ఇబి) "సాంఘిక బహిష్కరణ" అనగా ఏదైనా వ్యక్తితో సాంప్రదాయంగా జరిపే సేవలను చేయటం లేక అటువంటి సేవలను చెయ్యించుకోవటం కానీ*

*నిరాకరించడం లేదా వారితో సాధారణంగా జరిపే సామాజిక సంబంధాలను జరపకపోవడం లేదా ఆ వ్యక్తిని ఇతరుల నుండి ఏకాకిని చేయడం*

*ఇసి) "బాధితులు" అనగా సెక్షన్ 2 (1) (c) లో చెప్పబడిన షెడ్యూల్డు కులాల, తెగల వారై వుండి ఈ చట్టంలోని ఏదైనా నేరం వారిపట్ల జరిగినందువలన భౌతిక, మానసిక, ఉద్వేగ పూరిత లేదా ఆర్థికపరమైన లేదా వేదన అనుభవించిన వ్యక్తి మరియు అతని బంధువులు, సంరక్షకులు మరియు వారసులు;*

*ఇడి) "సాక్షి" అనగా ఈ చట్టంలోని నేరాలకు సంబంధించిన దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని, విషయాలను అందచేయగలిగిన స్థితిలో వుండి విచారణలో, దర్యాప్తులో ఏవైనా పత్రాలను అందచేయడం లేదా ఏదైనా వాంగ్మూలం ఇవ్వగలిగిన వ్యక్తి. నేరానికి గురైన బాధితులను కూడా సాక్షులుగానే పరిగణించాలి.*

*ఎఫ్) ఈ చట్టంలో ఉపయోగించబడిన పదాలకు ఈ చట్టంలో నిర్వచనం లేకపోతే ఆ పదాలకు భారత శిక్షా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టం, లేదా నేర విచారణ స్మృతులలో చెప్పబడిన అర్థం వర్తిస్తుంది.*

2) ఈ చట్టంలో వేరే చట్టాల గురించి ప్రస్తావన వచ్చినపుడు ఏదైనా ప్రాంతంలో ఆ చట్టం అమలులో లేకుంటే దానికి అనుగుణంగా అక్కడ అమలులో వుండే చట్టం గురించి ప్రస్తావించినట్టు భావించాలి.

## అధ్యాయము II

### అత్యాచార నేరాలు

***3. అత్యాచారాల నేరాలకు శిక్ష:***

*1)* షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందని వ్యక్తి ఎవరైనా

*a.* షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తిని తినరాని, అసహ్యకరమైన పదార్థము లేదా పానీయము బలవంతముగా సేవించేట్లు చేసినా

*b.* షెడ్యూల్డు కులాలు మరియు తెగలు వుండే ప్రాంతంలో లేదా ఆ ప్రాంత ప్రవేశ ద్వారంలో చెత్త, మృత కళేబరాలు, ఇతర అశుద్ధ పదార్థములు పడవేసినా. *

*c.* గాయపరిచే లేక అవమానపరిచే లేక బాధించే ఉద్దేశ్యంతో షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తి నివసించే పరిసర ప్రాంతంలో చెత్త, మృత కళేబరాలు, ఇతర అశుద్ధ పదార్థాలను పడవేసినా;

*d.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తికి చెప్పుల దండవేసినా, లేక నగ్నంగా లేక అర్ధనగ్నంగా వూరేగించినా;

*e.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని బలవంతంగా బట్టలు వూడదీసినా, శిరోముండనం చేసినా, మీసాలు గొరగడం, ముఖానికి లేక శరీరానికి రంగులు పూయడం తదితర ఆత్మగౌరవాన్ని కించపరిచే పనులు చేసినా;

*f.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తి సొంత భూమిని కానీ, లేక అతనికి కేటాయించబడిన భూమిని కానీ లేక అతనికి కేటాయించ బడుతున్నట్టు ప్రభుత్వ శాఖ ప్రకటించిన భూమిని కానీ, దురుద్దేశంతో ఆక్రమించినా లేదా సాగుచేసినా లేదా తనకు బదిలీ చేయించుకున్నా;

*g.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వారిని దురుద్దేశంతో పొలం నుండి గెంటివేసినా, నీరు, నీటి పారుదల సౌకర్యాలు, అటవీ హక్కులు తదితరాలపై వారి హక్కులను ఆటంకపరిచినా, పంటలను ధ్వంసం చేసినా వారి పంటను తీసుకువెళ్ళినా;

ఈ సబ్ క్లాజ్‌లో మరియు *f* క్లాజులో ఉపయోగించిన 'దురుద్దేశం' అనే పదానికి అర్థం :

*A.* ఆ వ్యక్తి ఇష్టానికి వ్యతిరేకంగా

*B.* ఆ వ్యక్తి అనుమతి లేకుండా

*C.* ఆ వ్యక్తిని లేదా ఆ వ్యక్తి సంబంధీకులను చంపుతామని లేదా గాయపరుస్తామని బెదిరించి అనుమతి తీసుకున్నా.

*D.* ఆ భూమికి సంబంధించి తప్పుడు దస్తావేజులను సృష్టించినా.

*h.* ప్రజా ప్రయోజనాల నిమిత్తం ప్రభుత్వం ఆదేశించిన నిర్బంధ సేవ మినహా మరే విధంగానైనా షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని బలవంతంగా బేగార్ లేక వెట్టిచాకిరీ చేయించటం లేక నిర్బంధపు పనులేవైనా చేయించినా;

---

* (అంటే ఇది తెలిసి చేసినా, తెలియక చేసినా వారిని అవమానించాలనే ఉద్దేశ్యం వున్నా, లేకపోయినా నేరమే).

*i.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని మానవ లేదా జంతు మృత కళేబరాలను తొలగించమని లేదా శవాలను పూడ్చేందుకు గొయ్యి తవ్వమని బలవంతం చేసినా;

*j.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని పాకీ పనికి వినియోగించినా లేదా అనుమతించినా;

*k.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన స్త్రీని ఒక దేవతకు, విగ్రహానికి, దేవాలయానికి, పూజించే వస్తువుకు లేదా ఏదైనా మత సంస్థకు దేవదాసీగా కానీ అలాంటి ఆచారానికి గురిచేసినా లేదా అనుమతించినా;

*l.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని ఈ క్రింది అంశాలలో బెదిరించినా, బలవంతంపెట్టినా;

*A.* ఏదైనా ఒక అభ్యర్ధికి ఓటు వేయమని లేదా వేయవద్దని లేదా చట్ట ప్రకారం కాని ఏ ఇతర పద్ధతిలో ఓటు వేయమనినా;

*B.* అభ్యర్థిగా నామినేషన్ వేయవద్దని లేదా వేసిన నామినేషన్ ఉపసంహరించుకోమన్నా;

*C.* షెడ్యూల్డు కులాల, తెగల వ్యక్తి అభ్యర్ధిత్వాన్ని ప్రతిపాదించవద్దని లేదా సమర్ధించవద్దని చెప్పినా;

*m.* రాజ్యాంగంలో *IX* వ భాగంలో చెప్పబడిన పంచాయితీ వ్యవస్థ లేదా *IX A* లో చెప్పబడిన మున్సిపాలిటీ వ్యవస్థలకు సంబంధించిన పదవుల్లో లేదా అధ్యక్షునిగా వున్న షెడ్యూల్డు కులాల, తెగల వ్యక్తులను తమ విధులు, కార్యక్రమాలు నిర్వర్తించనీయకుండా బెదిరించినా లేక ఆటంకపరిచినా;

*n.* ఎన్నికల తరువాత షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తులపై సాంఘిక, ఆర్థిక బహిష్కరణ విధిస్తామని బెదిరించినా, గాయపరిచినా, తీవ్రంగా గాయపరిచినా;

*o.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తి ఏదైనా ఒక అభ్యర్ధికి ఓటు వేసినందుకు లేదా వేయనందుకు లేదా చట్టప్రకారం ఓటు హక్కు వినియోగించుకున్నందుకు ఈ చట్టం చెప్పబడిన ఏ నేరాన్ని చేసినా;

*p.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిపై తప్పుడు ఆరోపణలతో లేదా దురుద్దేశ పూరితమైన లేదా వేధించేందుకు ఏదైనా దావా వేసినా లేదా నేరారోపణ పూరితమైన ఇతర చట్టపరమైన చర్యలు చేపట్టినా;

*q.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని బాధించేందుకు లేదా ఇబ్బంది పెట్టేందుకై ప్రభుత్వాధికారులకు తప్పుడు లేదా ఆకతాయి సమాచారం ఇచ్చి సదరు అధికారి షెడ్యూల్డు కులాల తెగల వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పురికొల్పినా;

*r.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని అవమానపరిచేందుకై ఉద్దేశ పూర్వకంగా బహిరంగ ప్రదేశంలో నిందించినా లేదా బెదిరించినా;

*s.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వారిని బహిరంగంగా కులం పేరుతో దూషించినా;

*t.* షెడ్యూల్డు కులాలు, తెగలవారు సాధారణంగా పవిత్రంగా లేదా అత్యంత గౌరవంగా చూస్తారని తెలిసిన వస్తువును నాశనం చేసినా, చెడగొట్టినా, అవమానపరిచినా;

*వివరణ:* ఈ సెక్షన్‌లో ఉపయోగించబడిన వస్తువు అనే పదం విగ్రహం, పటం, చిత్రం లాంటి వాటికి వర్తిస్తుంది.

*u.* మాటలు, రాతలు, సంజ్ఞలు లేదా ఇతర కనిపించే విధానాల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తులపై శతృత్వం, ద్వేషం, లేదా హేయమైన భావం పెంపొందించేట్లు చేయడం.

*v.* షెడ్యూల్డు కులాలు, తెగలు అత్యంత గౌరవించుకునే గతించిన వ్యక్తుల పట్ల మాటలు, రాతలు, తదితర విధానాల ద్వారా అగౌరవంగా ప్రవర్తించినా;

*w.* *i.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన స్త్రీ అని తెలిసి ఆమెను లైంగిక దృష్టితో ఆమె అనుమతి లేకుండా తాకినా;

*ii.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన స్త్రీ అని తెలిసి ఆమెపట్ల లైంగికపరమైన మాటలు, చర్యలు, సైగలు చేసినా;

*వివరణ:* పైన క్లాజు (1) లో ఉపయోగించిన 'అనుమతి' అనే పదానికి అర్థం ఆమె స్వయంగా మాటలు, చర్యలు, ఇతరత్రా సైగల ద్వారా ఆ పనికి తన ఇష్టాన్ని తెలియచేసి వుండాలి:

భౌతికంగా ఒక స్త్రీ అడ్డుకోనంతమాత్రాన ఆ లైంగిక చర్యకు ఆమె అనుమతించినట్లు భావించకూడదు;

ఆ స్త్రీ గత లైంగిక ప్రవర్తన గాని అతనితో వున్న లైంగిక సంబంధంతో సహా, ప్రస్తుత చర్యకు అనుమతించినట్లుగా పరిగణించరాదు. మరియు అది ప్రస్తుత నేరాన్ని తగ్గించదు.

*x.* షెడ్యూల్డు కులాలు, తెగలు ఉపయోగించే నీటిని, వాగులు, బావులు ఇతర నీటి వనరులను వారికి పనికిరాని విధంగా పాడుచేసినా.

*y.* అందరూ ఉపయోగించుకునే ఏదయిన బహిరంగ ప్రాంతానికి వెళ్ళేందుకు షెడ్యూల్డు కులాలు, తెగలవారు సాంప్రదాయక హక్కుగా ఉపయోగించుకునే దారినుండి వారిని వెళ్ళనీయకుండా అడ్డుకోటం లేదా ప్రజా బాహుళ్యం లేదా ఏదయినా తరగతి ప్రజలు ఉపయోగించుకునే బహిరంగ ప్రాంతాన్ని షెడ్యూల్డు కులాలు, తెగల వారిని వెళ్ళనీయకుండా అడ్డుకోవటం;

*z.* షెడ్యూల్డు కులాలు, తెగల వారిని వారి ఇల్లు, నివాస ప్రాంతం లేదా ఇతర ప్రదేశం నుంచి బలవంతంగా వెళ్ళగొట్టినా లేదా అందుకు కారణమైనా.

అయితే ప్రభుత్వ విధుల నిర్వహణలో భాగంగా చేసిన చర్యలకు ఇది వర్తించదు.

*za.* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తులను ఈ క్రింది అంశాల్లో అడ్డగించినా, ఆటంక పరిచినా;

*A.* ఏదైనా ప్రాంతంలోని అందరికీ చెందిన సామాజిక వనరులు లేదా శ్మశానం, నది, వాగు, బావి, చెరువు, పంపు, స్నానపు ఘట్టాలు ఇతర ప్రజా సౌకర్యాలు, వీధులు, దారులు తదితరాలు ఉ పయోగించుకోవటం;

*B.* సైకిళ్ళు, మోటారు సైకిళ్ళపై వెళ్ళడం, బహిరంగ ప్రాంతాల్లో చెప్పులు, నూతన బట్టలు ధరించి తిరగడం, పెళ్ళి ఊరేగింపుగా వెళ్ళడం, గుర్రంగానీ లేదా ఇతర వాహనం ఎక్కి పెళ్ళి ఊరేగింపు చేయడం;

*C.* *ఒక మతానికి చెందిన వారందరూ వెళ్ళే ప్రార్థనా స్థలంలోకి ప్రవేశించటం లేదా మతపరమైన సామాజిక, సాంస్కృతిక ఊరేగింపులు, జాతరలు చేయటం,*

*D.* *ఏదైనా విద్యాసంస్థ, వైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దుకాణం, ఇతర బహిరంగ వినోద స్థలాల్లో ప్రవేశించడం, ప్రజా ఉపయోగార్థం ఉద్దేశించబడిన పాత్రలను, వస్తువులను ఉపయోగించడం.*

*E.* *ప్రజా బాహుళ్యం లేదా కొన్ని తరగతుల ప్రజలు చేసే వృత్తి, వ్యాపకం, వ్యాపారం, అమ్మకం, ఉద్యోగం తదితరాలు షెడ్యూల్డు కులాల తెగలవారు చేయనీయకుండా అడ్డుకోవటం;*

*zb.* *షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన వ్యక్తిని చేతబడి చేస్తున్నారని, మంత్రగాడు లేదా మంత్రగత్తె అని ఆరోపించి భౌతికంగా లేదా మానసికంగా గాయపరచడం.*

*zc.* *సాంఘిక, ఆర్థిక బహిష్కరణ విధించడం లేదా విధిస్తామని షెడ్యూల్డు కులాలవారిని, కుటుంబాన్ని లేదా వ్యక్తిని బెదిరించటం.*

*పై నేరాలు చేసినట్లయితే వారికి ఆరు నెలలకు తక్కువ కాకుండా ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.*

2. షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందని వ్యక్తి:

i) ఏదయినా నేరానికి మరణశిక్ష పడుతుందని తెలిసిగాని అలా శిక్ష పడాలి అనే ఉద్దేశ్యంతో ఎవరయినా షెడ్యూల్డు కులాల తెగలకు చెందిన వ్యక్తిపై తప్పుడు సాక్ష్యం ఇచ్చినా లేదా తప్పుడు సాక్ష్యాధారాలు సృష్టించినా అటువంటి వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడుతుంది. అటువంటి తప్పుడు సాక్ష్యం లేదా సృష్టించబడిన తప్పుడు సాక్ష్యాధారాల కారణంగా ఎవరయినా షెడ్యూల్డు కులాల తెగలకు చెందిన నిర్దోషి మరణశిక్షకు గురై ఉరితీయబడితే అలా తప్పుడు సాక్ష్యం ఇచ్చిన వ్యక్తికి మరణశిక్ష విధించబడుతుంది.

ii) ఉద్దేశ పూర్వకంగా అబద్ధ సాక్ష్యం చెప్పటం లేదా సృష్టించటం ద్వారా షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తికి ఏడేళ్లు లేదా అంతకు ఎక్కువ శిక్ష విధించేటట్లు చేసినా, అటువంటి వ్యక్తికి 6

నెలలకు తక్కువ కాకుండా ఏడేళ్ల వరకు శిక్ష విధించవచ్చు లేదా ఆ శిక్షను ఏడేళ్ళకు పైగా పెంచవచ్చు. జరిమానా విధించవచ్చు.

iii) షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారి ఆస్తిని నష్టపరచు ఉద్దేశ్యంతో తగులబెట్టినా లేదా ఏదైనా ప్రేలుడు పదార్థముతో నష్టపరచినా, వారికి ఆరు నెలలకు తక్కువ కాకుండా ఏడు సంవత్సరములు వరకు శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

iv) షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారి ప్రార్థనాలయములకు సంబంధించిన భవనములు గాని లేక వారు తిరుగాడే భవనములు గాని లేక వారి ఆస్తులుంచు భవనములు గాని నష్టపరచవలెనను ఉద్దేశ్యంతో తగులబెట్టిన లేదా ఏదైనా ప్రేలుడు పదార్థములతో నష్టపరచిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

v) భారత శిక్షాస్మృతిలో నిర్వచించబడ్డ నేరాలలో 10 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ జైలు శిక్షార్హమైన నేరాలను షెడ్యూల్డు కులాలకు, తెగలకు చెందిన వ్యక్తులపై లేదా వారి ఆస్తులపై చేసినప్పుడు ఆ నేరానికి యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు. ***ఈ సెక్షన్ కింద నేరం చేసినప్పుడు ఆ వ్యక్తి షెడ్యూల్డు కులాలకు చెందిన వాడని లేదా ఆ ఆస్తి వారిదని నేరస్తునికి తెలిసి ఉంటే చాలు.***

***va) ఈ చట్టానికి ఇవ్వబడిన అనుబంధంతో చెప్పబడ్డ భారత శిక్షా స్మృతిలోని నేరాలను వేటినైనా షెడ్యూల్డు కులాలు లేదా తెగలకు చెందిన వ్యక్తులపై లేదా వారి ఆస్తులపై చేసినప్పుడు శిక్షా స్మృతిలో అటువంటి నేరాలకు నిర్దేశించిన శిక్షలను మరియు జరిమానా కూడా విధించాలి.***

vi) ఈ అధ్యాయంలో చెప్పబడిన నేరాలు జరిగినట్లు తెలిసి ఆ నేరాన్ని కప్పిపుచ్చే ఉద్దేశ్యంతో అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను మాయం చేయడం లేదా ఉద్దేశ్య పూర్వకంగా అందుకు సంబంధించిన తప్పుడు సమాచారం ఇవ్వడం తద్వారా నేరస్థుడ్ని కాపాడేందుకు ప్రయత్నించడం చేసినప్పుడు అటువంటి వ్యక్తికి ఆ నేరానికి ఎంత శిక్ష ఉన్నదో ఆ శిక్షను వేయవచ్చు.

vii) ఈ సెక్షనులో చెప్పబడిన నేరం చేసిన వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి కనుక అయివుంటే అతనికి ఒక సంవత్సరం తగ్గకుండా ఆ నేరానికి నిర్దేశించిన కాలం వరకు జైలు శిక్ష విధించవచ్చు.

## 4. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి శిక్ష:

*1)* షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందని ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ఈ చట్టం కింద మరియు నిబంధనల కింద తను నిర్వర్తించవలసిన విధులను ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే అతనికి ఆరు నెలలకు తగ్గకుండా సంవత్సరం వరకు జైలు శిక్ష విధించవచ్చు.

*2)* పైన క్లాజ్ (1) లో చెప్పబడిన ప్రభుత్వ ఉద్యోగి విధులలో ఈ క్రిందివి ఉంటాయి.

*a.* పోలీసు స్టేషన్ అధికారి తనకు ఎవరైనా నోటిమాట ద్వారా సమాచారం ఇచ్చినపుడు అది రాసుకుని సదరు వ్యక్తికి చదివి వినిపించిన తరువాతనే అతని సంతకం తీసుకోవాలి.

*b.* ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు ప్రథమ సమాచార రిపోర్టుగా ఈ చట్టం ఇతర సంబంధిత చట్టాల సెక్షన్ల కింద సరిగ్గా నమోదు చేసుకోవాలి.

*c.* ఈ విధంగా నమోదు చేసుకున్న సమాచారం నకలును సమాచారం ఇచ్చిన వ్యక్తికి అందజేయాలి.

*d.* బాధితుల, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసుకోవాలి.

*e.* దర్యాప్తు చేయడం మరియు ప్రత్యేక కోర్టులో లేదా కేవలం ఇందుకోసమే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టులో అరవై రోజుల లోపు చార్జిషీటు దాఖలు చేయాలి, ఏదైనా ఆలస్యం జరిగితే అందుకు కారణాలను రాత పూర్వకంగా తెలియజేయాలి.

*f.* ఏదైనా దస్తావేజును లేదా ఎలక్ట్రానిక్ రికార్డును తయారు చేయడం లేదా అనువదించడం సరిగా చేయాలి.

*g.* ఈ చట్టం కింద మరియు ఈ చట్టానికి అనుగుణంగా రూపొందించబడిన నిబంధనలను కింద నిర్వర్తించాల్సిన విధులను సరిగా నిర్వర్తించాలి.

అయితే పరిపాలన పరమైన విచారణ తరువాత సిఫార్సు చేసినప్పుడు మాత్రమే సంబంధిత ఆరోపణలను ప్రభుత్వోద్యోగిపై నమోదు చేయవచ్చు.

*3)* పైన (2) లో చెప్పినట్లు ప్రభుత్వ ఉద్యోగి విధులను నిర్లక్ష్యం చేసినపుడు ప్రత్యేక కోర్టు లేదా కేవలం ఈ నేరాల విచారణకై ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు నేరాన్ని

*పరిగణలోకి తీసుకుని ఆ ప్రభుత్వోద్యోగిపై కేసు నమోదు చేయమని ఆదేశించవచ్చు.*

## 5. రెండవ సారి నేరానికి శిక్షాకాలం హెచ్చింపు:

ఈ అధ్యాయంలో పేర్కొన్న నేరాలకు శిక్ష విధించబడిన వ్యక్తి మరలా రెండోసారి లేదా రెండవ నేరాన్ని చేసిన యెడల ఒక సంవత్సరం తక్కువ కాకుండా ఆ నేరానికి పొందుపరచిన శిక్ష విధించవచ్చు.

## 6. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షనులు వర్తింపు:

ఈ చట్టంలోని ఇతర అంశాలతో పాటు ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 34, అధ్యాయం (3), అధ్యాయం (4), అధ్యాయం (5), అధ్యాయం (5) ఎ, సెక్షన్ 149, అధ్యాయం (23) లు ఈ చట్టానికి వర్తిస్తాయి.

## 7. వ్యక్తుల ఆస్థులను జప్తు చేయుట :

1) ఈ అధ్యాయంలో పేర్కొన్న ప్రకారం నేరం చేసి శిక్ష విధించబడిన వ్యక్తి స్థిర చరాస్తులేవైనా నేరం చేయటంలో ఉపయోగించబడినట్లయితే అలాంటి ఆస్తులు ప్రభుత్వ పరమైనట్లుగా ప్రత్యేక కోర్టు లిఖిత పూర్వకంగా ప్రకటించవచ్చు.

2) ఈ అధ్యాయంలో పేర్కొన్న నేరాల క్రింద నిందితుడైన వ్యక్తి స్థిర చరాస్తులను స్వాధీనం చేసుకొని, విచారణ ముగిసిన తరువాత నేరం రుజువైన పక్షంలో ఆ ఆస్తులను జరిమానా విధించబడిన మేరకు జప్తు చేసే అధికారం ప్రత్యేక కోర్టుకు ఉన్నది.

## 8. నేరాలకు సంబంధించిన పురోభావము:

ఈ అధ్యాయంలో నేరాల విచారణ జరిపినప్పుడు ఈ క్రింది విధంగా నిరూపించబడితే

a. ***ఈ అధ్యాయంలో చెప్పబడిన నేరాలకు సంబంధించి ఎవరైనా ఎటువంటి ఆర్థిక సహాయం చేసినా*** సదరు వ్యక్తి ఆ నేరాన్ని ప్రోత్సహించినట్లుగా ప్రత్యేక కోర్టు భావించాలి. తనకు అలాంటి ఉద్దేశ్యం లేదని నిరూపించాల్సిన బాధ్యత ఆ వ్యక్తిపై ఉంటుంది.

b. ఒక సమూహంగా ఈ అధ్యాయంలో చెప్పబడిన నేరాలను చేసినప్పుడు ఆ నేరం గతంలో ఉన్నటువంటి భూమి తదితర వివాదాలకు కొనసాగింపుగా జరిగినప్పుడు ఆ నేరం సామూహిక ఉద్దేశ్యంతో జరిగినట్లు భావించాలి.

*c. ఈ అధ్యాయం కింద నేరాలను విచారించేటప్పుడు ముద్దాయికి బాధితుని గురించి, అతని కుటుంబం గురించి తెలిసినట్లయితే ఆ ముద్దాయికి బాధితుడు షెడ్యూల్డు కులాలు, తెగలకు సంబంధించినవాడని తెలిసినట్లుగా ప్రత్యేకకోర్టు పరిగణించాలి. అలా కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ముద్దాయిపైనే ఉంటుంది.*

**9. అధికారాల అప్పగింత :**

1) నేర విచారణ స్మృతిలోగాని, ఈ చట్టంలోగాని చెప్పబడిన దానితో సంబంధం లేకుండా,

   a. ఈ చట్టం కింద నేరాన్ని ఆపేందుకై లేదా వాటిని పరిష్కరించేందుకు

   b. ఈ చట్టం కింద ఏదైనా కేసుగాని లేదా చాలా కేసులుగాని, రాష్ట్ర ప్రభుత్వం అవసరం అని భావిస్తే ఒక ప్రకటన ద్వారా ఆయా జిల్లాల్లో లేదా ప్రాంతాల్లో ఎవరైనా ప్రభుత్వాధికారికి పోలీసు అధికారాలను అప్పగించవచ్చు. తద్వారా ఆ కేసును లేదా కేసులకు సంబంధించి దర్యాప్తు, అరెస్టు, ప్రత్యేక కోర్టులో విచారణ తదితర విధులను ఆ అధికారి నిర్వర్తించవచ్చు.

2) పైన సబ్ సెక్షన్ (1) లో చెప్పబడిన అధికారికి పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు సహకరించి ఈ చట్టం నిబంధనలు, పథకాలు అమలయ్యేందుకు దోహదపడాలి.

3) సబ్ సెక్షన్ (1) లో చెప్పబడిన అధికారి తన అధికారాలను నేర విచారణ స్మృతికి అనుగుణంగా నిర్వహించాలి.

## అధ్యాయము III

### ప్రాంత బహిష్కరణ

**10. నేరం చేస్తాడని భావించిన వ్యక్తి ప్రాంత బహిష్కరణ:**

1) భారత రాజ్యాంగం అధికరణం 244లో చెప్పబడిన షెడ్యూల్డు ప్రాంతాలు, లేదా ఆదివాసీ ప్రాంతాలు లేదా ***ఈ చట్టంలోని సెక్షన్ 21 (2) (vii) లో చెప్పబడిన ప్రాంతాలలో*** ఎవరైనా వ్యక్తి అధ్యాయం II లోని నేరాలను చేసే అవకాశం ఉందని ఏదైనా ఫిర్యాదు ద్వారా లేదా పోలీసు నివేదిక ద్వారా తెలిసినప్పుడు సదరు వ్యక్తిని ఆ ప్రాంతం నుంచి బహిష్కరిస్తూ ప్రత్యేక కోర్టు

ఉత్తర్వులు జారీచేయవచ్చు. అలాంటి ఉత్తర్వుల్లో ఆ వ్యక్తి ఆ ప్రాంతం నుండి ఏ దిశలో, ఎంతకాలంలో, ఎలా వెళ్ళిపోవాలో నిర్దేశించవచ్చు. ఈ బహిష్కరణ ఎంతకాలం ఉంటుందో ఆ ఉత్తర్వుల్లో నిర్దేశించాలి. కాని అది మూడు సంవత్సరాలకు పైబడి ఉండకూడదు.

2) పైన చెప్పబడిన ఉత్తర్వుల్ని జారీచేసే ప్రత్యేకకోర్టు అందుకు కారణం బహిష్కరించబడుతున్న వ్యక్తికి తెలియజేయాలి.

3) ఈ ఉత్తర్వుల వల్ల బహిష్కరణకు గురైన వ్యక్తి లేదా అతని తరుపున ఎవరైనా ఉత్తర్వులు ఇచ్చిన 30 రోజులలోగా ప్రత్యేకకోర్టుకు నివేదించుకోవచ్చు. ఆ నివేదన తరువాత ప్రత్యేక కోర్టు అవసరమైతే పైన సబ్‌క్లాజ్ (1)లో చెప్పబడిన ఉత్తర్వులను రద్దు లేదా మార్పు చేయవచ్చు. అయితే అందుకు కారణాలను రాత పూర్వకంగా నమోదు చేయాలి.

**11. బహిష్కరణకు గురైన వ్యక్తి ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళకుంటే లేదా తిరిగి వస్తే పాటించాల్సిన పద్ధతి :**

1) సెక్షన్ 10 క్రింద ఉత్తర్వులు ద్వారా బహిష్కరణకు గురైన వ్యక్తి,

a. ఆదేశాలను పాటించి ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళకుంటే; లేదా

b. వెళ్ళినప్పటికీ కోర్టు అనుమతి లేకుండా తిరిగి ఆ ప్రాంతానికి వస్తే,

ప్రత్యేక కోర్టు సదరు వ్యక్తిని నిర్బంధించి ఆ ప్రాంతం నుంచి తీసుకువెళ్ళమని పోలీసులను ఆదేశించవచ్చు.

2) పైన సెక్షన్ 10 ప్రకారం బహిష్కరించబడిన వ్యక్తి మరలా ఆ ప్రాంతానికి వచ్చేందుకు ప్రత్యేక కోర్టు రాత పూర్వక ఉత్తర్వులు ద్వారా అనుమతించవచ్చు. అయితే అటువంటి అనుమతిచ్చేందుకు షరతులు విధించటమే కాక బాండు రాసి ఇవ్వమని ఆదేశించవచ్చు. అటువంటి బాండు, జామీనుతో గాని జామీను లేకుండా కాని ఇవ్వమని ఆదేశించవచ్చు.

3) పైన చెప్పబడిన అనుమతిని ప్రత్యేక కోర్టు ఏ సమయంలోనైనా రద్దు చేయవచ్చు.

4) బహిష్కరణకు గురైన వ్యక్తి కోర్టు అనుమతితో ఆ ప్రాంతానికి తిరిగి వచ్చినప్పుడు కోర్టు విధించిన షరతులను పాటించాలి. అదే విధంగా కోర్టు అనుమతిచ్చిన కాలం పూర్తవ్వగానే తిరిగి వెళ్ళిపోవాలి. అలా వెళ్ళిపోయి తనకు సెక్షన్ 10 కింద ఇచ్చిన ఉత్తర్వుల్లో చెప్పబడిన కాలం పూర్తయ్యే వరకు బయట ప్రాంతంలోనే

ఉండాలి. తను బహిష్కరించబడిన ప్రాంతానికి తిరిగి రావాలంటే మళ్ళీ కోర్టు అనుమతి ఉండాలి.

5) ఎవరైనా బహిష్కరించబడిన వ్యక్తి షరతులు పాటించకపోయినా లేదా అనుమతి కాలం పూర్తవ్వగానే వెళ్ళకపోయినా లేదా మరలా అనుమతి లేకుండా ఆ ప్రాంతానికి తిరిగి వచ్చినా సదరు వ్యక్తిని నిర్బంధించి బహిష్కరించమని ప్రత్యేక కోర్టు ఆదేశించవచ్చు.

**12. సెక్షన్ 10 కింద బహిష్కరణకు గురైన వ్యక్తుల కొలతలు, ఫోటోలు తీసుకొనుట:**

1) 10వ సెక్షను కింద చేసిన ఉత్తర్వులకు గురైన వ్యక్తి యొక్క కొలతలను, ఫోటోలను తీసుకోవాలని ప్రత్యేకకోర్టు కోరినట్లయితే, అట్టి వ్యక్తి పోలీసు అధికారికి సహకరించి ఆ విధంగా తీసుకోనివ్వాలి.

2) సబ్ సెక్షన్ (1)లో నిర్దేశించిన ఎవరైన వ్యక్తిని అతని కొలతలను లేక ఫోటోలను తీసుకోవాలని కోరినప్పుడు అట్టి కొలతలు లేక ఫోటోలు తీసుకొనివ్వకుండా ప్రతిఘటిస్తే లేక తీసుకోనివ్వనిచో, వాటిని తీసుకొనుటకు అవశ్యకమైన పద్ధతులన్నింటిని ఉపయోగించుట చట్ట సమ్మతమైనది.

3) కొలతలు లేక ఫోటోలు తీసుకోనీయకుండ సబ్‌సెక్షన్ (2) కింద ప్రతిఘటించుట లేక వాటిని తీసుకొననీయకుండుట భారత శిక్షాస్మృతి 186 వ సెక్షన్ కింద నేరంగా భావించవలెను.

**13. సెక్షన్ 10 ప్రకారం జారీ చేసిన ఉత్తర్వు ఉల్లంఘించినప్పుడు జరిమానా:**

1) సెక్షన్ 10 ప్రకారం కోర్టు జారీచేసిన ఉత్తర్వును ఉల్లఘించిన వ్యక్తికి జైలు శిక్ష ఒక సంవత్సరం వరకు విధించవచ్చు మరియు జరిమానా కూడా విధించవచ్చు.

## అధ్యాయము IV

## ప్రత్యేక న్యాయస్థానాలు

***14. ప్రత్యేక కోర్టు మరియు కేవలం ఈ విచారణ కోసమే నియమింపబడిన ప్రత్యేకకోర్టు:***

*1) నేర విచారణ త్వరితగతిని జరిగేందుకై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏకీభావంతో 'కేవలం ఈ చట్టం క్రింద నేరాలను విచారించేందుకై ప్రత్యేక కోర్టుల'ను ఏర్పాటు చేయాలి అది ప్రభుత్వ రాజపత్రంలో ప్రకటించాలి.*

అయితే ఈ చట్టం క్రింద నేరాల సంఖ్య తక్కువగా ఉండే జిల్లాల్లో సెషన్స్ కోర్టుల్నే ప్రత్యేక కోర్టులుగా పరిగణిస్తూ ప్రకటన జారీ చేయవచ్చు. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏకీభావంతో చేయాలి.

పైన చెప్పబడిన కోర్టులు ఈ చట్టం కింద నేరాలను తమంతట తామే నేరుగా గుర్తించి విచారణకు స్వీకరించవచ్చు.

2) ఈ చట్టం కింద కేసుల విచారణ సాధ్యమైనంత వరకు 2 నెలలలోగా పూర్తయ్యేందుకు వీలుగా అవసరమైన ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క విధి.

3) ప్రత్యేక కోర్టు లేదా కేవలం ఈ కేసుల్ని విచారించేందుకే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టులు సాక్షులందరు పూర్తయ్యే వరకు రోజువారీగా విచారణ జరగాలి. తప్పనిసరి అయితే రాత పూర్వకంగా కారణాలను నమోదు చేసి మాత్రమే మరుసటి రోజుకు వాయిదా వేయాలి.

ఈ చట్టం కింద నేరాల విచారణ సాధ్యమైనంత వరకు చార్జిషీటు వేసిన రెండు నెలలులోగా పూర్తి చేయాలి.

## 14 ఎ. అప్పీళ్ళు

1) నేర విచారణ స్మృతిలో నిర్దేశించబడిన దానితో సంబంధం లేకుండా ప్రత్యేక కోర్టు లేదా కేవలం ఈ కేసులకే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టు జారీచేసిన తీర్పులు, శిక్షలు లేదా ఉత్తర్వులకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై గాని, నిజానిజాలకు సంబంధించిన అంశాలపై గాని హైకోర్టుకు మాత్రమే అప్పీలు చేసుకోవాలి. అయితే ఈ నిబంధన మధ్యంతర ఉత్తర్వులకు వర్తించదు.

2) ప్రత్యేక కోర్టు లేక కేవలం ఈ కేసులకే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టు బెయిల్ ఇస్తూ లేదా నిరాకరిస్తూ జారీచేసిన ఉత్తర్వులపై అప్పీలు హైకోర్టుకు మాత్రమే చేయాలి. ఈ అంశంపై నేర విచారణ స్మృతి సెక్షన్ 378 (3) వర్తించదు.

3) ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల్లో చెప్పబడిన దానితో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద అప్పీలు, తీర్పు, శిక్ష లేదా ఉత్తర్వులు జారీ చేయబడిన 90 రోజులలోగా చేసుకోవాలి.

*అయితే తగిన కారణాలు ఉన్నట్టుగా సంతృప్తి చెందితే 90 రోజుల దాటిన తరువాత కూడా అప్పీలు చేసుకునేందుకు హైకోర్టు అనుమతించవచ్చు.*

*కాని ఎటువంటి సందర్భంలోనైనా గాని 180 రోజులు దాటిన తరువాత అప్పీలును అనుమతించరాదు.*

*4) పైన సబ్ క్లాజ్ (1) అనుగుణంగా తీసుకోబడిన అప్పీల్ని సాధ్యమైనంత వరకు మూడు నెలలులోగా పరిష్కరించాలి.*

### *15. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్:*

*1) ప్రతి ప్రత్యేక కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ని లేదా ఏడు సంవత్సరముల కంటే తక్కువ కాని అనుభవం ఉన్న న్యాయవాదిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజపత్రంలో ప్రకటించాలి.*

*2) కేవలం ఈ కేసుల విచారణకు మాత్రమే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కోర్టులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ను లేదా ఏడు సంవత్సరములకు తక్కువకాని అనుభవం ఉన్న న్యాయవాదిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజపత్రంలో ఉత్తర్వులు జారీచేయాలి.*

## అధ్యాయము IV A

### బాధితుల, సాక్షుల హక్కులు

### *15ఎ. బాధితుల సాక్షుల హక్కులు:*

*1) బాధితులు వారిపై ఆధారపడిన వారు, మరియు సాక్షుల రక్షణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వారిని ఎటువంటి ఒత్తిడికి, బెదిరింపులకు, హింసకు ప్రలోభాలకు గురికాకుండా తగు ఏర్పాట్లు చేయాలి. ఇది ప్రభుత్వ విధి, బాధ్యత.*

*2) బాధితుల్ని గౌరవంగా, న్యాయంగా మానవతా దృక్పథంతో చూడాలి. వారి వయసును, నిరక్ష్యరాస్యతను, పేదారికాన్ని, లింగ పరమైన అంశాల్ని దృష్టిలో ఉంచుకుని వారిని చూడాలి.*

*3) బాధితులు వారిపై ఆధారపడ్డ వారికి కోర్టు సంబంధించిన బెయిలు, విచారణ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు నియామకం తదితర అంశాలపై పూర్తి మరియు సరైన సమాచారం ముందస్తుగా అందించాలి.*

*4)* కేసుకు సంబంధించిన కక్షిదారులను కోర్టుకు రప్పించి వారి ద్వారా డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించే విధంగా చేయమని మరియు సాక్షుల్ని, వ్యక్తుల్ని విచారించమని ప్రత్యేక కోర్టులకు నివేదించుకునే హక్కు బాధితులకు ఉంటుంది.

*5)* ఈ చట్టం కింద కేసులలో బెయిలు, విడుదల, పెరోల్, శిక్ష తదితర అంశాలు ఇతర విచారణ పరమైన అంశాలపై బాధితులు, వారిపై ఆధారపడిన వారికి తమ వాదనలు వినిపించి రాత పూర్వక వాదనలు సమర్పించుకునే హక్కు ఉంటుంది.

*6)* నేర విచారణ స్మృతిలో చెప్పబడిన దానితో సంబంధం లేకుండా బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి, సమాచారం ఇచ్చిన వారికి, సాక్షులకు, ప్రత్యేక కోర్టు ఈ కింది సదుపాయాలు కల్పించాలి –

*a.* న్యాయం కోసం వారికి పూర్తి రక్షణ;

*b.* దర్యాప్తు, పరిశీలన, విచారణ సమయంలో అవసరమయ్యే రవాణా ఖర్చులు మరియు భత్యం;

*c.* దర్యాప్తు, విచారణ కాలంలో సామాజిక, ఆర్థిక పునరావాసం;

*d.* వారికి వేరే స్థానం ఏర్పాటు చేయడం;

*7)* బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి, సాక్షులకు, సమాచారమిచ్చే వారికి ప్రభుత్వం కల్పించిన రక్షణ చర్యల గురించి ప్రత్యేక కోర్టుకు తెలియజేయాలి. ప్రత్యేక కోర్టు ఈ ఏర్పాట్లను కాలానుగుణంగా పరిశీలించి తగు ఉత్తర్వులు జారీ చేయాలి.

*8)* పైన సబ్ సెక్షన్ *(6)* లో చెప్పబడిన అంశాలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా, ప్రత్యేక కోర్టు బాధితులకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. ఈ చర్యలు బాధితుల, సాక్షుల, ఆధారపడిన వ్యక్తుల ఫిర్యాదు మూలంగా గాని, వారి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫిర్యాదు మూలంగాగాని లేక కోర్టు తనంతట తానే గాని ఈ చర్యలు చేపట్టవచ్చు. అందులో భాగంగా ఈ కింద చెప్పబడినవి చేయవచ్చు. –

*a)* తన ఉత్తర్వుల్లో, తీర్పుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ఇతర రికార్డుల్లో సాక్షుల పేర్లు, చిరునామాల్ని ప్రస్తావించకుండా గోప్యంగా ఉంచడం;

*b)* అలాంటి గోప్యత పాటించమని ఉత్తర్వులు జారీచేయడం;

*c)* బాధితుల, సాక్షుల, సమాచారమిచ్చిన వారిని వేధించినట్టు ఫిర్యాదు వస్తే ఆ ఫిర్యాదుపై వెంటనే స్పందించి అదే రోజు వారి రక్షణ కొరకై తగు ఉత్తర్వులు జారీచేయడం;

అయితే ఈ సబ్‌క్లాజ్ (*c*)లో చెప్పబడిన ఫిర్యాదుపై విచారణ అసలు విచారణతో కలపకుండా ప్రత్యేకంగా విచారించి ఫిర్యాదు చేసిన రెండు నెలలులోగా పూర్తిచేయాలి.

అలాగే ఈ సబ్‌క్లాజ్ (*c*)లో చెప్పబడిన ఫిర్యాదు ప్రభుత్వ ఉద్యోగిపై అయినప్పుడు సదరు ఉద్యోగి మరలా సాక్షులు, బాధితులు, సమాచారమిచ్చిన వారితో జోక్యం చేసుకోకుండా నిరోధిస్తూ ఉత్తర్వులు జారీచేయాలి. కోర్టు అనుమతి లేకుండా సదరు ఉద్యోగి వారితో ఎటువంటి సంబంధాలు జరపరాదు.

*9)* బాధితుడు, సాక్షులు, సమాచారమిచ్చిన వారు ఎవరైనా తాము బెదిరింపులకు, ఒత్తిడికి, హింసకు లేదా ప్రలోభాలకు గురువుతున్నట్లుగా మౌఖికంగా లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పుడు దర్యాప్తు అధికారి మరియు పోలీసు స్టేషను అధికారి ఆ ఫిర్యాదును స్వీకరించి ప్రథమ సమాచార నివేదికగా నమోదు చేయాలి. అలా నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక నఖలును ఫిర్యాదుదారునికి ఉచితంగా, వెంటనే ఇవ్వాలి.

*10)* ఈ చట్టం క్రింది నేరాలకు సంబంధించిన అన్ని విచారణలను వీడియో ద్వారా రికార్డు చేయాలి.

*11)* బాధితుల, సాక్షులకు, న్యాయం చేకూర్చేందుకు తగు పథకాలు రూపొందించి తద్వారా వారికి ఈ క్రింది హక్కులు, సదుపాయాలు కల్పించడం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత –

*a)* ప్రథమ సమచార నివేదిక నకళ్ళు ఉచితంగా అందచేయడం;

*b)* బాధితులు, వారిపై ఆధారపడిన వారికి నగదు మరియు వస్తు రూపేణ తక్షణ సహాయం అందించడం;

*c)* బాధితులు, వారిపై ఆధారపడిన వారికి మరియు సాక్షులకు తగు రక్షణ కల్పించడం;

*d)* మరణించిన లేదా గాయపడిన లేదా ఆస్తికి నష్టం జరిగిన సందర్భాల్లో తక్షణ సహాయం అందజేయడం;

*e)* బాధితులకు ఆహారం లేదా నీరు లేదా బట్టలు లేదా గూడు లేదా వైద్య లేదా రవాణా సదుపాయాలు, రోజువారీ భత్యం కల్పించడం;

*f)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి పోషణ ఖర్చు అందించడం;

*g)* ఫిర్యాదు చేసిన సందర్భంలో మరియు ప్రథమ సమాచార నివేదిక నమోదు చేసిన సందర్భంలో అత్యాచార బాధితులకు వారి హక్కుల గురించి సమాచారం ఇవ్వడం;

*h)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి బెదిరింపుల నుంచి, వేధింపుల నుంచి రక్షణ కల్పించడం;

*i)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి, వారికి సహకరిస్తున్న సంస్థలకు, వ్యక్తులకు దర్యాప్తు గురించి చార్జ్‌షీటు గురించి సమాచార మివ్వటం మరియు ఉచితంగా చార్జ్‌షీటు నకలును అందజేయడం;

*j)* వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం;

*k)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి, వారికి సహకరించే సంస్థలకు, వ్యక్తులకు సహాయం చేసిన పైకం గురించిన సమాచారం అందజేయడం;

*l)* అత్యాచార బాధితులకు వారిపై ఆధారపడిన వారికి, వారికి సహకరించే సంస్థలకు, వ్యక్తులకు ముందస్తుగానే విచారణ, దర్యాప్తు సంబంధించిన తేదీలు, ప్రాంతాల గురించిన సమాచారం అందజేయడం;

*m)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వారికి, వారికి సహకరించే సంస్థలకు, వ్యక్తులకు విచారణకు సంబంధించిన తర్ఫీదును ఇవ్వడం అందుకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడం;

*n)* అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడినవారికి, వారికి సహకరించే సంస్థలకు, వ్యక్తులకు ఈ చట్టం క్రింద విచారణ జరిగే ప్రతి దశలో వారి హక్కులు అనుభవించేందుకు తగు విధంగా సహకరించడం

*12)* అత్యాచార బాధితులకు వారిపై ఆధారపడిన వారికి, స్వచ్ఛంద సంస్థల నుండి, సామాజిక కార్యకర్తల నుండి, న్యాయవాదుల నుండి సహకారం పొందే హక్కు ఉంటుంది.

# అధ్యాయము V

## వివిధ విషయములు

**16. సామూహిక జరిమానా విధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారాలు :**

ఈ చట్టము క్రింద సామూహిక జరిమానా విధించి, దానిని వసూలుచేయుట కొరకు, అందుకు సంబంధించిన ఇతర విషయములు కొరకు పౌరహక్కుల పరిరక్షణ చట్టము 1955 యొక్క సెక్షన్ 10 ఎ నిబంధనలు వీలైనంత మేరకు వర్తించును.

**17. శాంతి భద్రతల యంత్రాంగం చేపట్టవలసిన ముందస్తు నిరోధక చర్యలు :**

1) తమ పరిధిలోకి వచ్చు ప్రాంతములో షెడ్యూల్డు కులము లేదా తెగలకు చెందని వ్యక్తి లేదా వ్యక్తులు షెడ్యూల్డు కులాలు / తెగల వారిపై అత్యాచారము చేసే పరిస్థితి ఉన్నా లేదా అట్లు చేయగలమని బెదిరించినా మరియు అలా జరిగే అవకాశం ఉందని తాను భావించినా జిల్లా మెజిస్ట్రేట్ లేదా ఇతర ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయికి తగ్గని పోలీస్ అధికారి ఆ సమాచారం అందినపుడు విచారణ జరిపి అట్లు అత్యాచారం జరిగే అవకాశం ఉందని భావించినపుడు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు మరియు ప్రజాశాంతి నెలకొల్పేందుకు ముందస్తు చర్యలు తీసుకునేందుకై ఆ ప్రాంతాన్ని అత్యాచారం జరగబోయే ప్రాంతంగా ప్రకటించి తగు చర్యలు చేపట్టవచ్చు.

2) సబ్ సెక్షన్ (1) అమలు చేయుటకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 8, 10 మరియు 11 అధ్యాయాలలోని సెక్షన్లు వర్తిస్తాయి.

3) సబ్ సెక్షన్ (1) లో తెలియపరచిన విధంగా అధికారులు, చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని లేదా పథకాలను తయారు చేసి అత్యాచారాలను నిరోధించి షెడ్యూల్డు కులాల, తెగల వారిలో భద్రతా భావాన్ని కలిగించేందుకు సరైన ఆచరణాత్మక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించవచ్చు.

**18. ఈ చట్టపరమైన నేరాలకు ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 438 (ముందస్తు బెయిల్) వర్తించకుండుట:**

ఈ చట్టంలో పేర్కొన్న నేరాలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 438 సెక్షన్, (ముందస్తు బెయిలు) వర్తించదు

## 19. ఈ చట్టంలో నేరాలకు నేర పరివేక్షణ చట్టం వర్తించదు:

ఈ చట్టము క్రింద నేరము చేసినందుకు దోషియైయుండి పదునెనిమిది సంవత్సరములు వయసు దాటిన ఏ వ్యక్తికైనను స్మృతిలోని 360 వ సెక్షన్‌లోని నిబంధనలు మరియు నేర పరివేక్షణ చట్టము, 1958 వర్తించవు.

## 20. ఇతర చట్టాలపై ఈ చట్టం ఆధిక్యత :

ఈ చట్టంలో పొందుపరచిన అంశాలకు విరుద్ధంగా ఇతర చట్టాలలో, ఆచారాలలో, సాంప్రదాయాలలో ఏమి ఉన్నా అవి చెల్లనేరవు, వాటన్నిటిపై ఈ చట్టానికే ఆధిక్యత ఉంటుంది. ఈ చట్టంలో ఏదైనా మినహాయింపు పొందుపరిస్తే తప్ప ఇతరత్ర ఏవీ వర్తించవు.

## 21. ఈ చట్టాన్ని సమర్ధవంతంగా అమలుపరచటానికి ప్రభుత్వం విధులు :

1) కేంద్ర ప్రభుత్వము ఈ విషయమున చేయు నియమములకు లోబడి రాష్ట్ర ప్రభుత్వము ఈ చట్టమును కట్టుదిట్టముగా అమలు జరుపుటకు అవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

2) ప్రత్యేకించి, పై నిబంధనలకు భంగము కలుగకుండా అట్టి చర్యలలో ఈ క్రిందివి ఉండవచ్చును.

i) అత్యాచారములకు గురియైన వ్యక్తులు న్యాయము పొందుటకు వీలుగా వారికి న్యాయసహాయముతో సహా తగు సౌకర్యములను ఏర్పాటు చేయుట;

ii) ఈ చట్టము క్రింద నేరములు దర్యాప్తు, విచారణ జరుగుచున్నప్పుడు, అత్యాచారములకు గురైన వారితో సహా సాక్షులకు ప్రయాణ మరియు పోషణ ఖర్చులను సమకూర్చుట;

iii) అత్యాచారములకు గురియైన వారికి ఆర్థిక మరియు సాంఘిక పునరావాసములను కల్పించుట;

iv) ఈ చట్టం క్రింది విచారణలు ప్రారంభించుట లేక పర్యవేక్షించుటకు తగు అధికారులను నియమించుట;

v) అట్టి చర్యలను రూపొందించుటలోను, అమలు పరచుటలోను రాష్ట్ర ప్రభుత్వమునకు తోడ్పడుటకు గాను, రాష్ట్ర ప్రభుత్వము సబబని తలచునట్టి సముచిత స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయుట.

vi) ఈ చట్టపు నిబంధనలను మరింత కట్టుదిట్టముగా అమలు పరచుటకు గాను చర్యలను సూచించు దృష్టితో ఈ చట్టపు నిబంధనలు అమలగుచున్న తీరును నిర్ణీత కాలములో సమీక్షించుటకు ఏర్పాటుచేయుట.

vii) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారు ఏ ప్రాంతములలో అత్యాచారములకు గురయ్యే ఆస్కారముకలదో ఆ ప్రాంతములను గుర్తించుట, వారికి భద్రతను కల్పించుటకై చర్యలను తీసికొనుట.

3) కేంద్ర ప్రభుత్వము, సబ్ సెక్షన్ (1) క్రింది రాష్ట్ర ప్రభుత్వములు తీసుకొనిన చర్యలను సమన్వయపరచుటకు ఆవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

4) ఈ సెక్షన్ అనుసరించి కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వములు తీసుకొనిన చర్యల నివేదికను కేంద్ర ప్రభుత్వము ప్రతి సంవత్సరము పార్లమెంటు ఉభయ సభలలో సమర్పించాలి.

**22. సదుద్దేశంతో చేసిన చర్యలకు రక్షణ :**

ఈ చట్టము క్రింద సదుద్దేశముతో చేపట్టిన చర్యలవలన లేక చేయుటకు ఉద్దేశించినందుకై కేంద్ర ప్రభుత్వముపై గాని, రాష్ట్ర ప్రభుత్వముపైగాని, ప్రభుత్వం అధికారి పైనగాని, ఎవరైన గాని దావా, అభియోగము లేక ఇతర చట్టబద్ధ చర్య ఏదియు వుండదు.

**23. నిబంధనలు రూపొందించే అధికారం:**

1) కేంద్ర ప్రభుత్వము ఈ చట్ట ప్రయోజనమును నెరవేర్చుటకు నిబంధనలు రూపొందించి రాజపత్రంలో ప్రకటించవచ్చు.

2) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమావళి దానిని చేసిన పిమ్మట వీలైనంత త్వరగా, పార్లమెంటు ముందు ఆమోదానికి ఉంచాలి. పార్లమెంటు మొత్తం 30 రోజులు కాల వ్యవధితో ఉన్నప్పుడే ఈ నియమావళి ఆమోదానికి ఉంచాలి. ఉభయసభలు ఆ నియమం చేయాలనిగాని, చేయకూడదు అని గాని ఆమోదిస్తే తదనుగుణంగా ఆ నియమావళి అమలులోకి రావటం లేదా రాకపోవటం జరుగుతుంది. ఆ నియమావళికి ఏవైనా మార్పులు చేయాలని ప్రతిపాదిస్తే తదనుగుణంగా మార్చిన నియమావళిని అమలుపరచాలి.

## అనుబంధం [ సెక్షన్ 3(2) (va) ]

| భారత శిక్షాస్మృతిలోని సెక్షను | నేరము దానికి శిక్ష |
|---|---|
| ***120A*** | నేర పూరిత కుట్ర నిర్వచనం. |
| ***120B*** | నేర పూరిత కుట్రకు శిక్ష. |
| ***141*** | చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం. |
| ***142*** | చట్ట వ్యతిరేక సమూహంలో సభ్యుడుగా వుండటం. |
| ***143*** | చట్ట వ్యతిరేక సమూహానికి శిక్ష. |
| ***144*** | మారణాయుధాలు కలిగిన చట్టవ్యతిరేక సమూహంలో చేరటం. |
| ***145*** | చట్ట వ్యతిరేక సమూహాన్ని విడిపోయి వెళ్ళమని ఆదేశించిన సంగతి తెలిసికూడా ఆ సమూహంలో చేరటం లేక కొనసాగటం. |
| ***146*** | దొమ్మి |
| ***147*** | దొమ్మికి శిక్ష. |
| ***148*** | మారణాయుధాలతో దొమ్మి చేయటం. |
| ***217*** | ఒక వ్యక్తికి శిక్ష నుంచి కాపాడేందుకు లేదా ఆస్థిని జప్తు కానీకుండా చూసేందుకు ప్రభుత్వోద్యోగి చట్టాన్ని ఉల్లంఘించటం. |

| | |
|---|---|
| ***319*** | గాయపరచటం. |
| ***320*** | తీవ్రంగా గాయపరచటం. |
| ***323*** | స్వచ్ఛందంగా గాయపరిచినందుకు శిక్ష. |
| ***324*** | ప్రమాదకరమైన ఆయుధంతో లేదా పద్ధతిలో గాయపరచటం. |
| ***325*** | స్వచ్ఛందంగా గాయపరిచినందుకు శిక్ష. |
| ***326B*** | స్వచ్ఛందంగా యాసిడ్ చల్లడం లేదా చల్లేందుకు ప్రయత్నించటం. |
| ***332*** | ప్రభుత్వ ఉద్యోగిని విధులు నిర్వర్తించకుండా భయపెట్టేందుకై గాయపర్చటం. |
| ***341*** | చట్ట వ్యతిరేకంగా దారికి అడ్డుగా నిలిచి కదలనివ్వకపోవటం. |
| ***354*** | ఒక స్త్రీని అవమాన పరిచే వుద్దేశ్యంతో బెదిరించటం లేదా బలప్రయోగం చేయటం. |
| ***354A*** | లైంగికంగా వేధించటం మరియు లైంగిక వేధింపుకు శిక్ష. |
| ***354B*** | ఒక స్త్రీని వివస్త్రను చేసే ఉద్దేశ్యంతో బెదిరించటం లేదా బల ప్రయోగం చేయటం. |
| ***354C*** | స్త్రీల నగ్న దృశ్యాలను రహస్యంగా చూడటం. |
| ***354D*** | మాటలు, చేష్టలతో విసిగించటం. |
| ***359*** | అపహరించటం. |

| | |
|---|---|
| ***363*** | అపహరించినందుకు శిక్ష. |
| ***365*** | రహస్యంగా, చట్ట వ్యతిరేకంగా నిర్బంధించే ఉద్దేశ్యంతో అపహరించటం లేదా బలవంతంగా తీసుకువెళ్ళటం. |
| ***376B*** | చట్టపరంగా భర్తతో దూరంగా వున్న సమయంలో ఆమెతో సంభోగించటం. |
| ***376C*** | అధికారంలో వున్న వ్యక్తి తన అధికారాన్ని వుపయోగించి ఒక స్త్రీతో సంభోగించటం. |
| ***447*** | నేరపూరితంగా ఇతరుల స్థలంలోకి చొరబడటం. |
| ***506*** | నేరపూరితంగా బెదిరించినందుకు శిక్ష. |
| ***509*** | స్త్రీని కించపరిచే ఉద్దేశ్యంతో మాట్లాడటం, సైగలు చేయటం లేదా ఏవైనా చర్యలు చేయటం. |